
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



సోమశిలలో 20.837 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం నాటికి 20.837 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 10,133 క్యూసెక్కుల వంతున ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.72,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,555
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,752
సవర (8 గ్రాములు)	రూ.54,016

గరిష్టం/కనిష్టం
36.6 /28.5

వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఉక్కపోత ఉంటుంది. గాలిలో తేమ 56 శాతం ఉంది.

న్యూస్‌రీల్

మహనీయుల త్యాగం ఆదర్శనీయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు



వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు తదితర నేతలు

నెల్లూరు (బారకాసు): స్వాతంత్య్ర పోరాటంలో మహనీయుల త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహనీయుల అడుగు జాడల్లో నడిచి గడిచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేసిందని తెలిపారు. ఈ రోజు పేద ప్రజలు సగర్వంగా బతుకుతున్నారంటే అది వైఎస్సార్‌సీపీ చేసిన సంక్షేమ, అభివృద్ధే అని చెప్పొచ్చన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాలు కూడా దేశ, రాష్ట్ర ప్రజానికానికి సంక్షేమ పాలన అందించి వారికి అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్‌అహ్మద్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు హంజాహుస్సేనీ, మురళీధర్‌రెడ్డి, షేక్ సిద్ధిక్, కార్పొరేటర్లు వేలూరు మహేష్, ఊటుకూరు నాగార్జున, కిన్నెర ప్రేమ్‌కుమార్, డివిజన్ ఇన్‌చార్జిలు కిన్నెర ప్రసాద్, కొణిదల సుధీర్, శ్రీకాంత్, సిద్దన సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, చంద్రారెడ్డి, కిషన్, కరిముల్లా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంగా కమ్యూనిటీ భవనం



పచ్చ కుర్చీలు వేసి టీడీపీ కార్యాలయంగా మార్చిన తిమ్మసముద్రం కమ్యూనిటీ భవనం

జలదంకి: టీడీపీ నేతలు బరి తెగిస్తున్నారు. ప్రజల సామాజిక అవసవరాల కోసం ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని టీడీపీ కార్యాలయంగా మార్చేశారు. మండలంలోని తిమ్మసముద్రంలో ప్రభుత్వానికి సంబంధించిన కమ్యూనిటీ భవనం ఉంది. గురువారం స్థానిక టీడీపీ నేతలు భవనం తాళాలు పగులగొట్టి పచ్చ కుర్చీలు వేసి టీడీపీ కార్యాలయంగా మార్చేశారు. గ్రామంలో 20 ఏళ్లుగా ఉన్న కమ్యూనిటీ భవనాన్ని టీడీపీ కార్యాలయంగా మార్చడంపై గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వానికి చెందిన భవనాలను సైతం టీడీపీ ఆస్తులుగా మార్చుకుంటున్నారు. ఈ విషయంపై స్థానిక సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో సర్పంచ్ విషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

నేడు, రేపు రాష్ట్ర గవర్నర్ పర్యటన

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ 16, 17 తేదీల్లో నెల్లూరులో పర్యటించనున్నారు. 16వ తేదీ మధ్యాహ్నం 3.10 గంటలకు రాజ్‌భవన్ నుంచి బయలుదేరి విజయవాడ రైల్వేస్టేషన్ చేరుకుని రైల్లో రాత్రి 7.18 గంటలకు నెల్లూరుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చేరుకుని రాత్రి బస చేస్తారు. 17వ తేదీ ఉదయం 10.15 గంటలకు పోలీస్ పరేడ్‌గ్రౌండ్ చేరుకుని 10.30 గంటలకు భారత ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతారు. ఉదయం 10.35 గంటలకు వెంకటాచలంలోని అక్షర విద్యాలయానికి చేరుకుంటారు. 10.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు ట్రస్ట్‌లో జరిగే వేడుకల్లో గవర్నర్ పాల్గొంటారు. మధ్యాహ్నం 2.35 గంటలకు ట్రస్టు నుంచి బయలుదేరి 2.50 గంటలకు నెల్లూరు పరేడ్ గ్రౌండ్ చేరుకుని భారత ఉపరాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతారు. సాయంత్రం 6 గంటలకు నెల్లూరు రైల్వేస్టేషన్ చేరుకుని విజయవాడ వెళ్తారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు

జిల్లాలో 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్య్ర పోరాటం చేసిన త్యాగధనుల గురించి వివరించారు. నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి నారాయణ కలెక్టర్, ఎస్పీలతో వివిధశాఖల అధికారులతో కలిసి జెండావిష్కరణ చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్ జెండా ఆవిష్కరించి మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తి యామిని, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్, అక్షర విద్యాలయంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు జాతీయ పతాకాలను ఎగురవేశారు. పోలీస్ పరేడ్ మైదానంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. జిల్లాలో వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

- జిల్లా అంతటా 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

నెల్లూరు (దర్గామిట్ట): ఆధునిక సాంకేతికత అండగా జిల్లాలో గ్రామాలు, పట్టణాల సర్వతోముఖాభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అకుంఠిత దీక్షతో పని చేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గురువారం 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో మంత్రి నారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్ ఓ. ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకం కింద 17వ విడతకు జిల్లాలో అర్హులైన 1,65,940 మంది రైతు కుటుంబాలకు రూ.2 వేల చొప్పున రూ.3.31 కోట్ల రైతుల ఖాతాల్లో జమ అయిందన్నారు. 2024 ఖరీఫ్ కాలానికి 50 శాతం రాయితీపై 5,828 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను 17,731 మంది రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాదిలో 38,330 సీసీఆర్ కార్డులు ఇవ్వాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 23,200 కార్డులు ఇచ్చామన్నారు. ఉద్యాన పంటల అభివృద్ధిలో భాగంగా 1,153 మంది రైతుల ఖాతాల్లో రూ.2.55 కోట్ల రాయితీ సొమ్ము జమ చేశామన్నారు. ఇప్పటి వరకు 45.7 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలు రైతులకు 75% సబ్సిడీతో పంపిణీ చేశామని, సెప్టెంబర్ నుంచి డిసెంబర్, 2024 వరకు పశుగణన జరుగుతుందన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద 3,13,784 మంది లబ్ధిదారులకు నెలకు రూ.132 కోట్లు పెన్షన్ నగదును ప్రతి నెలా 1వ తేదీనే ప్రభుత్వ సిబ్బంది ద్వారా వారి ఇంటి వద్దనే అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ రంగాల్లో గత ప్రభుత్వం జరిగిన అభివృద్ధి, ప్రణాళికలను టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిగా, ప్రణాళికలుగా మంత్రి ప్రకటించారు. అనంతరం పని తీరులో ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాలను తిలకించారు. మెప్మా ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, జిల్లా స్థాయి అధికారులు పరిశీలించారు. ఈ వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జేసీ కార్తీక్, నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌లో యువత భాగస్వాములు కావాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

వెంకటాచలం: వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వెంకటాచలం మండలం సరస్వతీనగర్ వద్దనున్న అక్షర విద్యాలయంలో గురువారం జరిగిన 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్య్ర సమరయోధుల కలలకు ప్రతి రూపమైన నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడంతో పాటు ప్రతి ఇంటి మీద జెండాను ఎగురవేసి ప్రజలంతా దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినీ, విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్టీ నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, అక్షర విద్యాలయం ప్రిన్సిపల్ కుముద, స్వర్ణభారత్ ట్రస్ట్ కోఆర్డినేటర్ జనార్దన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగఫలితమే స్వాతంత్య్రం

- ఎస్పీ కృష్ణకాంత్



పోలీసు కార్యాలయంలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ జి. కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): ఎందరో మహనీయుల పోరాటం, త్యాగఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని ఎస్పీ జి. కృష్ణకాంత్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ క్యాంపు, జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. సిబ్బందికి స్వీట్లు పంచి పెట్టారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర స్ఫూర్తితో సిబ్బంది విధులకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అన్యాయాలను, అక్రమాలను అరికట్టి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

అహింస, త్యాగాలతోనే స్వేచ్ఛ

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మహాత్ముడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇతర అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): ఎందరో మహానుభావుల అహింస త్యాగాల వల్లే నేడు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ కార్యాలయంలో గురువారం జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఆనం ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశిష్ట సేవలు అందించి స్వాతంత్య్ర దినోత్సవ పురస్కారాలకు ఎంపికైన జిల్లా పరిషత్ సీఈఓ కన్నమనాయుడు, జెడ్పీ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ చిరంజీవి, పరిపాలనా అధికారులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ ఆనంద్

కలెక్టరేట్‌లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

నెల్లూరు (దర్గామిట్ట): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు కలెక్టరేట్‌లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని జాతిపిత విగ్రహానికి కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్‌ఓ లవన్న, పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 100 అడుగుల స్థూపం వద్ద జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులకు కలెక్టర్ మిఠాయిలు పంచి పెట్టారు. హర్‌ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన బోర్డుపై కలెక్టర్, అధికారులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీసీఓ గుర్రప్ప, సమాచార పౌరసంబంధాలశాఖాధికారి కె సదారావు, కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం



జాతీయ జెండాను ఎగురవేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నెల్లూరు (లీగల్): జిల్లా కోర్టు ఆవరణలో న్యాయశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామినికి అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ జెండాను ఎగుర వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు జి.గీత, సత్యవాణి, తేజోవతి, శ్రీనివాసరావు, సరస్వతి, వెంకట నాగపవన్, న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి వాణి, న్యాయమూర్తులు కరుణాకుమార్, శ్రీనివాస్, స్వాతి, భరద్వాజ, లావణ్య, శారదా రెడ్డి, న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డీ.. నీ ఆరోపణలు నిరూపించు

- ఎలాంటి విచారణకైనా నేను సిద్ధం
- పంచభూతాలను దోచుకుంటున్న సోమిరెడ్డి
- లేఅవుట్లు, గ్రావెల్ మాఫియా నుంచి మామూళ్లు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : సోమిరెడ్డీ నాపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని, ఆయన అధికారంలో ఉన్నాడు కాబట్టి ఏ విచారణ సంస్థలతో అయినా విచారణ జరిపించినా తాను సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో కాకాణి మాట్లాడుతూ ఇరిగేషన్ పనుల్లో రూ.200 కోట్లు దోచుకున్నట్టు తనపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. ఇరిగేషన్‌కు కేటాయించిన నిధులు ఎంత? తెలుసుకోకుండా.. అందులో నేను రూ.200 కోట్లు దోచుకున్నట్లు ఆరోపణలు చేయడం చూస్తే కచ్చితంగా సోమిరెడ్డికి మతిస్థిమితం తప్పిందన్నారు. కలెక్టర్ వద్దకు వెళ్లి తనపై ఫిర్యాదు చేశాడరన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి ఎమ్మెల్యేగా ఆయన కుమారుడు షాడో ఎమ్మెల్యేగా పంచభూతాలను దోచుకుంటున్నారని కాకాణి ధ్వజమెత్తారు. గాలివాటంలో ఎమ్మెల్యే అయిన సోమిరెడ్డికి కనీస పరిజ్ఞానం లేదన్నారు. తనతో అభివృద్ధిలో పోటీపడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా.. అధికారం వచ్చిన రెండున్నర నెలల్లో ఏజెంట్లను పెట్టుకుని రూ.కోట్ల దోచుకుంటున్నారని కాకాణి ఆరోపించారు. జనాల కన్నీటితో కొనుగోలు చేసిన ఇంటిని ఇప్పటికీ ప్రజలు కన్నీటి భవనంగా పేరు పెట్టి పిలుచుకుంటున్నారన్నారు.

లేఅవుట్ల యజమానుల వద్ద ముడుపులు

సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా లేఅవుట్ల యజమానుల వద్ద ముడుపులు పుచ్చుకున్న ఎమ్మెల్యే ఎవరైనా ఉన్నారంటే అది సోమిరెడ్డేనని కాకాణి విమర్శించారు. లేఅవుట్లు వేసిన వారిని బెదిరించడం, వారి కట్టడాలను కూల్చడం బేరం కుదిరితే సైడ్ అయిపోవడం జరుగుతుందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గిరిజనుల పొలాల్లో అక్రమంగా మట్టి తోలుకుని సొమ్ము చేసుకుంటున్నారని, ఇసుక, మట్టి, గ్రావెల్ తరలింపునకు అడ్డే లేకుండాపోయిందన్నారు. ఇలా రెండు నెలల కాలంలోనే సోమిరెడ్డి రూ.కోట్లు కొల్లగొట్టాడని మండిపడుతున్నారు. అధికారులు చోద్యం చూడడం తప్పించి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమావేశంలో ఎంపీపీ కే సుబ్బరాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ మల్లిక చిట్టేమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ జీ.శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ కోనం చిన బ్రహ్మయ్య, మాజీ సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, నాయకులు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పీ పోలిరెడ్డి, ఎం.శేఖర్‌బాబు, వి.గోపాల్‌రెడ్డి, ఎస్‌కే అంజాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల బాహాబాహీ



ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

- ప్రభుత్వ భూమి విషయమై కర్రలు, రాళ్లతో దాడులు
- పలువురికి తీవ్ర గాయాలు
- గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు

ఉదయగిరి: వరికుంటపాడు మండలం కొండాయపాళెం పంచాయతీలోని ధర్మవరంలో ఓ ప్రభుత్వ భూమి విషయమై గురువారం టీడీపీలో రెండు వర్గాలు పరస్పరం కర్రలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో పలువురు తీవ్రంగా గాయపడడంతో ఉదయగిరి, పామూరు, ఆత్మకూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు, గ్రామస్తుల సమాచారం మేరకు.. ధర్మవరంలోని సర్వే నంబరు 148లో 6.64 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 3.03 ఎకరాల భూమిని 2019లో జాజం వెంకటేశ్వర్లు ఆక్రమించారు. దీంతో అదే గ్రామంలోని టీడీపీకి చెందిన ముజ్జే లక్ష్మీనారాయణ అనుచరుడు చిందే ప్రసాద్ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఆ భూమి వివాదాస్పదంగా మారింది. అయితే వెంకటేశ్వర్లుకు డీఫారం పట్టా ఇప్పించేందుకు ఆయన సోదరి కొండాయపాళెం ఎంపీటీసీ కాశే లక్ష్మీదేవి, ఆమె భర్త రమేష్ ప్రయత్నం చేశారు. కానీ వీలు పడలేదు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎంపీటీసీ భర్తతో కలిసి టీడీపీలో చేరారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ముజ్జే అనుచరుడు ప్రసాద్ ఆ వివాదాస్పద భూమిని ట్రాక్టర్‌తో దున్ని చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఎంపీటీసీ భర్త రమేష్ తన అనుచరులతో వెళ్లి ఆ భూమిని ట్రాక్టర్‌తో దున్నతుండగా, మరో వర్గం చెందిన ప్రసాద్ తన అనుచరులతో అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి కర్రలతో కొట్టుకుంటూ రాళ్ల విసురుకుంటూ ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన సుమారు 13 మందికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు రంగం ప్రవేశం చేసి పరిస్థితిని కొంత మేర అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రులను వివిధ వైద్యశాలలకు తరలించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుమారి సాయి ఇంట్లో ఉండగా కొంత మంది టీడీపీ వర్గీయులు గొడవకు దిగారు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. అయితే గ్రామంలో ఎలాంటి గొడవలు జరకుండా సీతారామపురం, వరికుంటపాడు ఎస్సైలు అనూష, తిరుపతయ్య ఆధ్వర్యంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఉదయగిరి సీఐ గిరిబాబు గ్రామంలో ఇరువర్గాలతో మాట్లాడి ఎలాంటి గొడవలు జరకుండా సమన్వయం పాటించాలని సూచించారు. ఈ ఘర్షణలో సంబంధం ఉన్న ఇరువర్గాలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): ఉపరాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నెల్లూరు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు, భద్రత చర్యలపై ఎస్పీ కృష్ణకాంత్, కేంద్ర ప్రభుత్వ భద్రతా అధికారులతో కలిసి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ గురువారం నిర్వహించారు. ముందుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్లను పరిశీలించారు. హెలికాప్టర్‌లో వస్తున్న ఉప రాష్ట్రపతికి స్వాగత కార్యక్రమాలు, భద్రతా అంశాలు, ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఫైర్ తదితర అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం వెంకటాచలం మండలం కసుపూరులోని అక్షర విద్యాలయం సందర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఉపరాష్ట్రపతి ప్రారంభించనున్న స్వర్ణభారత్ ట్రస్టులో నిర్మించిన అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను సందర్శించారు. ప్రజామండపంలో ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. అనంతరం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు మర్యాద పూర్వకంగా కలుసుకుని ఉపరాష్ట్రపతి పర్యటనపై చర్చించారు. ఈ పర్యటనలో జేసీ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, నుడా వీసీ బాపిరెడ్డి, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, ఎస్పీ సౌజన్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి పర్యటనకు రాష్ట్ర ప్రతినిధిగా ఆనం

నెల్లూరు(దర్గామిట్ట): భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాష్ట్ర పర్యటనకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధిగా నామినేట్ చేసింది. ఉప రాష్ట్రపతికి స్వాగతం, వీడ్కోలు కార్యక్రమాలతో పాటు ఆయనతో కలిసి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆనం ప్రయాణిస్తారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 9.15 గంటలకు తిరుపతి విమానాశ్రయంలో భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు మంత్రి ఆనం స్వాగతం పలుకుతారు.

ప్రతిభకు పట్టం

విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందిని అవార్డులు వరించాయి. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఒ.ఆనంద్ వారికి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. – సాక్షి నెట్‌వర్క్



మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్వో లవన్న



విద్యాధరి, కందుకూరు సబ్ కలెక్టర్ | మలోల, నెల్లూరు ఆర్డీఓ | శీనానాయక్, కావలి ఆర్డీఓ | కె.మధులత, ఆత్మకూరు ఆర్డీఓ



బాపిరెడ్డి, నుడా వైస్ చైర్మన్ | చిన్న ఓబులేసు, టీజీ స్పెషల్ కలెక్టర్ | పద్మావతి, సబ్ కలెక్టర్ | కన్నమనాయుడు, జెడ్పీ సీఈఓ | సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ | తిరుపతయ్య, జిల్లా ఆడిట్ అధికారి



చందర్, జిల్లా రవాణా శాఖాధికారి | శ్రీనివాసులు, డ్వామా పీడీ | వెంకటయ్య, డీబీసీడబ్ల్యూఓ | ఎ.సునీల్‌కుమార్, జేసీ, సీసీ | మధు, డీటీ, రూరల్ తహసీల్దార్ ఆఫీస్ | గురుజయంతి, ఏడీ పశుసంవర్ధక శాఖ | ప్రసన్నలక్ష్మి, డిప్యూటీ డీఈఓ



ఎం.మస్తాన్‌రెడ్డి, ఏపీఓ, విద్యాశాఖ | ప్రశాంత్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ | సిద్ధానాయక్, సూపరింటెండెంట్, జీజీహెచ్ | సయ్యద్ ఫరీద్ మస్తాన్, డీపీఆర్ఓ కార్యాలయం | గిరి, డీపీఆర్ఓ కార్యాలయం | సంపత్‌కుమార్, ఎస్సై, ఆర్ఐఓ

పోలీస్ సేవలకు సలాం

విధి నిర్వహణలో విశిష్ట సేవలు, ధైర్య సాహసాలు ప్రదర్శించిన పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రశంసాపత్రాలను అందజేశారు. – నెల్లూరు(క్రైమ్)



నారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య



ప్రసాద్, ఏఎస్పీ (క్రైమ్స్) | శ్రీనివాసరావు, ఏఎస్పీ (ఏఆర్) | డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ



ఎ.శ్రీనివాస్, కందుకూరు డీఎస్పీ | టి.సాయినాథ్, మహిళా స్టేషన్ డీఎస్పీ | ఎం.వెంకటరమణ, కావలి డీఎస్పీ | చిట్టెం కోటేశ్వరరావు, చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ | సుంకరయ్య, హోంగార్డ్స్ డీఎస్పీ



నాగేశ్వరమ్మ, డీటీసీ ఇన్‌స్పెక్టర్ | హైమారావు, బుచ్చిరెడ్డి పాళెం ఇన్‌స్పెక్టర్ | కె.అంకమరావు, ఎంటీఓ ఆర్ఐ | ఎ.సైదులు, చిన్నబజారు ఎస్సై | జి.సుబ్బారావు, ఎస్‌బీ ఎస్సై | ఎ.సురేష్‌బాబు, ఎస్‌బీ ఎస్సై



గీతారమ్య, నార్త్ ట్రాఫిక్ ఎస్సై | వరప్రసాద్, సౌత్ ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ | శ్యామ్‌ప్రసాద్, చిన్న బజారు కానిస్టేబుల్ | కార్తీక్, క్లూస్‌టీమ్ కానిస్టేబుల్ | కాంతరాజు, ఏపీ స్టార్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ | టీవీ సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్

అగ్నిమాపక సిబ్బంది విన్యాసం



పోలీస్ సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్



సీఎస్‌పురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన





గొలగమూడి గిరిజన పాఠశాల ఆశ్రమ విద్యార్థుల నృత్యం



డ్రోన్ సాయంతో జాతీయ జెండాను ఎగురవేస్తూ..



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

మదినిండా తిరంగా..

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు దేశభక్తి ఉప్పొంగేలా సాగాయి. దర్గామిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్, గొలగమూడిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, సంతపేటలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, చంద్రశేఖరపురం ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల, బుజబుజ నెల్లూరు శేషు ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యం చేశారు. స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ ఆనంద్ జ్ఞాపికలు అందజేశారు.

- వివిధ ప్రభుత్వ శాఖలు శకటాలు ప్రదర్శించాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ శకటానికి ప్రథమ బహుమతి, అటవీ శాఖకు ద్వితీయ బహుమతి, ఐసీడీఎస్ శకటానికి తృతీయ బహుమతులు లభించాయి. ఆయా శాఖల అధికారులకు మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్ జ్ఞాపికలను అందజేశారు.
- మెప్మా ఆధ్వర్యంలో 686 పొదుపు సంఘాలకు రూ.82.8 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును మంత్రి అందజేశారు. అలాగే విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.5 లక్షల విలువైన ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్లు తదితరాలను లబ్ధిదారులకు అందించారు.

రవిచంద్రకు ఇండియన్ పోలీస్ మెడల్



రవిచంద్ర

నెల్లూరు(క్రైమ్): ఆక్టోపస్ ఎస్పీ బల్లి రవిచంద్ర గురువారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీసు మెడల్ (ఐపీఎం)ను స్వీకరించారు. ఈయనది ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి. 1984లో పోలీసు శాఖలో ఆర్ఎస్ఐగా చేరారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలతోపాటు ఇంటెలిజెన్స్ (సెక్యూరిటీ వింగ్)ల్లో పనిచేశారు. 1992లో సివిల్ ఎస్సైగా కన్వర్షన్ పొంది నెల్లూరు జిల్లాలోని నవాబుపేట, కోవూరు, వెంకటాచలసత్రం, బాలాజీ నగర్, ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వహించారు. 2013లో సీఐగా, 2018లో డీఎస్పీగా పదోన్నతి పొంది ఒంగోలు, చిత్తూరు జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. 2020లో ఏఎస్పీగా, 2021లో నాన్‌కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆక్టోపస్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. పనిచేసిన ప్రతి ప్రాంతంలో రవిచంద్ర సమర్థవంతమైన అధికారిగా పేరుగడించారు. మిస్టరీగా మారిన ఎన్నో కేసులను ఛేదించారు. ఇప్పటికే ఆయన సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, ఉత్కృష్టసేవ, అతి ఉత్కృష్టసేవా పతకాలు అందుకున్నారు. డీజీపీ డిస్క్‌లు స్వీకరించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన ప్రతిభకు తాజాగా ఐపీఎం వరించింది. అవార్డు అందుకున్న ఆయనకు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.90
సన్నవి : రూ.50
పండ్లు : రూ.35



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 107
లేయర్ (లైవ్) : 95
బ్రాయిలర్ చికెన్ : 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 224
లేయర్ చికెన్ : 161



పోలీసులకు సేవా పతకాలు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలను, డీజీపీ బ్రాంజ్ మెడల్స్‌ను ప్రకటించారు. నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో గురువారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి నారాయణ చేతుల మీదుగా ఉదయగిరి సీఐ వి.గిరిబాబు, ఏఆర్ ఎస్సై ఎండీ కరిముల్లా, ఎస్‌బీ, దర్గామిట్ట, పొదలకూరు, చిన్నబజారు హెడ్‌కానిస్టేబుల్స్ ఎ.మల్లికార్జునరావు, జి.భాస్కర్‌రావు, టీవీ సుబ్బారావు, టీవీ వినోద్‌కుమార్, దిశ కానిస్టేబుల్ కె.శ్రీనివాసులు సేవా పతకాలను అందుకున్నారు. ఇంకా డీజీపీ కమాండేషన్స్ డిస్క్ కింద సైబర్ సెల్ హెడ్‌కానిస్టేబుల్ టి.మధుసూదనరావు, విడవలూరు కానిస్టేబుల్ పి.చెన్నకేశవరావు సిల్వర్ మెడల్ స్వీకరించారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ షేక్ షఫీఅహ్మద్, సీసీఎస్, ఎస్‌బీ, చిన్నబజారు ఏఎస్ఐలు జె.వెంకయ్య, ఎం.సుబ్రహ్మణ్యం, జి.శ్రీహరి, వీవీపాళెం, డీటీసీ, చిన్నబజారు, నవాబుపేట హెచ్‌సీలు ఆర్.రమేష్, షేక్ జిలానీ, ఎం.మధుసూదనరావు, సీహెచ్ సుందరరావు, నార్త్ ట్రాఫిక్, ఇందుకూరుపేట, కావలి రూరల్ కానిస్టేబుళ్లు షేక్ అబ్దుల్ ఖాదర్, పి.వీరభద్రయ్య, జి.శ్రీకాంత్‌లు బ్రాంజ్ మెడల్స్ అందుకున్నారు.

క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు

నెల్లూరుకు చెందిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఉద్యోగులు, వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన వారు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. – నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)



పి.విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ | అరుణకుమారి, యోగా శిక్షకురాలు | జశ్వంత్‌కుమార్, హాకీ ప్లేయర్ | కె.సాయికిరణ్, ఫుట్‌బాల్ కోచ్

కాగితాలకే పరిమితం

- స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాల నిర్వహణకు నిధులిచ్చామన్నారు
- పంచాయతీలకు విడుదల కాని వైనం

ఉదయగిరి: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు నిధులు పెంచినట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఒక్క రూపాయి విడుదల చేయలేదు. అంతా కాగితాలకే పరిమితమైంది. చాలా సంవత్సరాల నుంచి వేడుకల నిర్వహణకు పంచాయతీలకు నిధులు పెంచలేదని, తాను పెంచుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించి ఇటీవల వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.10 వేలు, రూ.25 వేలు పెంచుతున్నట్లు జీఓ విడుదల చేసింది. ఈ విషయంపై ఎల్లో మీడియాలో బాగా ప్రచారం చేశారు. కానీ వాస్తవం చూస్తే నిధులు గురువారం వరకు పంచాయతీల ఖాతాల్లో జమ కాలేదు. పవన్‌వి గాలిమాటలుగా మిగిలిపోయాయి. జిల్లాలో 722 గ్రామ పంచాయతీలుండగా, వీటిలో సుమారు 50 వరకు పది వేల జనాభాతో ఉన్నాయి. ఈ విషయమై వింజమూరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా జీఓ వచ్చిందని, నిధులు ఇంకా విడుదల కాలేదని చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తుందన్నారు.

ఎస్ఈ, ఏఈలకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు జిల్లా సర్కిల్‌కు ఉత్తమ అవార్డుతోపాటు, నెల్లూరు రూరల్, కావలి, నెల్లూరు టౌన్, ఓజిలి సెక్షన్, విజిలెన్స్ విభాగాల్లో అవార్డులు దక్కాయి. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో గురువారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో సీఎండీ సంతోషరావు చేతుల మీదుగా జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, అనిల్, వెంకటరామరెడ్డిలు అవార్డులు అందుకున్నారు.

గిరిజనుడ్ని హత్య చేసి.. కాల్చేసి..

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి పంచాయతీ పరిధిలోని ఉన్న అటవీ ప్రాంతంలో కాలిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గురువారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు.. మృతుడిని సీతారామపురం మండలం దేవమ్మచెరువుకు చెందిన గిరిజనుడైన మేకల పోలయ్యగా గుర్తించారు. ఇతను నాలుగు నెలలుగా శకునాలపల్లి గ్రామ సమీపంలోని చేపల చెరువు వద్ద కుటుంబసభ్యులతో కలిసి కాపలా ఉంటున్నాడు. ఈనెల 5న సింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన తన బంధువైన మరో వ్యక్తితో కలిసి కల్లు తాగేందుకు వెళ్లాడు. అతను తిరిగి రాగా పోలయ్య మాత్రం రాలేదు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు పోలయ్య కోసం గాలిసున్నారు. ఈ నేపథ్యంలో మృతదేహాన్ని గుర్తించారు. అతడిని హత్య చేసి పెట్రోల్ పోసి కాల్చివేసినట్లు కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి మిస్సింగ్

- గంటల వ్యవధిలో కుటుంబసభ్యులకు అప్పగింత

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైంది. గంటల వ్యవధిలోనే సంతపేట పోలీసులు ఆమెను గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. వారి కథనం మేరకు.. నగరంలోని గుప్తా పార్క్ సమీపంలో సాయిరామ్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమార్తెకు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. పలుమార్లు ఆమె ఇంటి నుంచి వెళ్లిపోగా వెతికి తీసుకొచ్చేవారు. గురువారం యువతి ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయింది. బాధిత కుటుంబసభ్యులు ఆమె కోసం గాలించారు. జాడ తెలియకపోవడంతో సంతపేట పోలీసులను ఆశ్రయించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కోవూరు, బుచ్చి, నెల్లూరు రూరల్, నెల్లూరు నగరంలోని పోలీసుస్టేషన్లకు సమాచారం అందించారు. గంటల వ్యవధిలోనే కోవూరు వద్ద ఆమెను గుర్తించి సురక్షితంగా కుటుంబసభ్యులకు అప్పగించారు.